

## ఉన్ని దుస్తులతో

# చలికి దూరం!

చలికాలం వచ్చిందంటే చాలు ఉన్నిదుస్తుల అన్వేషణ తప్పదు. ఇటీవల హైదరాబాద్ కూడా చలి ఎక్కువగా ఉన్న ప్రదేశాల జాబితాలో చేరింది. రానురాను ఉష్ణోగ్రత చలిపులి నుండి శరీరాన్ని రక్షించుకోవాలంటే ఉన్నిని ఆశ్రయిం చాల్సిందేకదా మరి. వణికించే చలిలో కూడా వంటికి వెచ్చదనాన్ని ఇచ్చే ఈ ఉన్ని దుస్తులను వాడటమంటే అందరికీ ఇష్టమే. వాటిని శుభ్రం చేయాలనే సరికే అనేక సందేహాలు మొదలవుతాయి. ఎలా ఉతకాలి, ఇలా చేస్తే పాడయిపోతాయేమో, అసలు వీటిని నీటిలో పెట్టకూడదేమో అనే ఆలోచనలతో సతమతమవుతారు. ఉన్ని దుస్తులను ఎలా శుభ్రపరచాలో అవి మళ్ళీ చలికాలం వచ్చే వరకూ భద్రంగా ఎలా ఉంచాలో తెలుసుకుందాం...

### ▸▸ మృదువుగా...

ఉన్ని దుస్తులను శుభ్రం చేయడంలో ఎప్పుడూ మృదువైన డిటర్జంట్‌నే వాడాలి. దీనికోసం ద్రవరూపంలో ఉన్న డిటర్జంటులను వాడితే మరీమంచిది. ఎందుచేతనంటే హార్డ్‌గా ఉండే డిటర్జంటులను వాడటంవలన ఉన్ని దుస్తులు ముడుచుకుపోయినట్టుగా అయిపోతాయి. వీటిలో ఉండే క్షారమృత్తికా లోహాల ప్రభావంవల్ల తొందరగా రంగుపో వటం, పీచులాగా రావడం కూడా జరుగుతుంది. డిటర్జంటు వేసిన నీటిలో కూడా ఉన్నిదుస్తులను ఎక్కువ సమయం నానబెట్టరాదు.

### ▸▸ ఉతికే విధానం

ఉన్ని దుస్తులను ఉతకడానికి ముందు గోరువెచ్చని నీటిలో వేస్తే దానికి పట్టి ఉన్న మురికి అంతా చక్కగా వదులుతుంది. బాగా వేడిగా ఉన్న నీటిని అస్సలు వాడ కూడదు. ఎక్కువ సమయం నీటిలో నానవివ్వనవసరం లేదు. వెడల్పుగా ఉన్న టబ్ లేదా బకెట్‌లో కొద్దిసేపు ఉంచితే పైనఉన్న దుమ్ము, ధూళీ వదలిపోతుంది. ఆ తరువాత సున్నితమైన డిటర్జంట్‌తో ఉతికి శుభ్రమైన నీటిలో ముంచితీయాలి. నీటిలో ఎంత ఎక్కువ ముంచి తీస్తే దుస్తులు అంత అందంగా ఉంటాయి. సాధ్యమైనంత మేర కు బాగా దుమ్ము పట్టకముందే వీటిని శుభ్రం చేసుకోవడం మంచిది. వీటిని సున్నితంగా శుభ్రంచేసిన తరువాత తొందరగా ఆరిపోవాలనే ఉద్దేశ్యంతో గట్టిగా పిండటం, నూలు దుస్తుల వలె పురిపెట్టడం చేయకండి. ఇలా చేస్తే దారాలుగా, పీచు బయటకువచ్చి దుస్తులు పాడవుతాయి. చూడటానికి కూడా చిరాగ్గా కనిపిస్తాయి.

### ▸▸ ఇలా ఆరబెట్టాలి

తడిగా ఉన్న ఉన్ని దుస్తులను ఒక టేబుల్‌పైన టవల్‌ను పరచి దానిపైన ఆరబెట్టాలి. అలాకాకుండా మిగతా దుస్తులవలె ఎక్కడైనా వేలాడదీస్తే వాటి ఆకారం మారిపోయి చూడటానికి ముడుచుకున్నట్లుగా కనిపిస్తాయి.

### ▸▸ ఇస్త్రీ కావాలా...

మీరు ధరించే ఉన్ని దుస్తులకు ఇస్త్రీ అవసరమను కుంటున్నారా! అలా అయితే ముందు మీ ఐరన్ బాక్స్ వేడిని దానికి తగినట్టుగా సాధ్యమైనంత తక్కువగా ఉండేటట్లు చూసుకోండి. ఆ తరువాత కొంచెం చెమ్మగా ఉన్న టవల్‌ను ఉన్ని బట్టపై కప్పి ఆపై ఇస్త్రీ చేయండి. ఇలా చేయటం వలన మీ అమూల్యమైన ఉన్ని దుస్తులకు ఎటువంటి హానీ జరగదు.

ఉన్ని దుస్తులను చేతితో ఉతకడమే మంచిది. వాషింగ్ మెషిన్‌లో అన్నిరకాల ఉన్ని దుస్తులు వేయకూడదు. కొన్ని దుస్తులను మాత్రమే ఇలా శుభ్రం చేయడానికి అనుగుణంగా ఉన్నిదుస్తుల కంపెనీల వారు తయారు చేస్తున్నారు. మిగతా వాటిని చేతితో శుభ్రం చేసుకోవడం తప్పనిసరి.

ఇలా శుభ్రం చేసి భద్రపరచుకుంటే మళ్ళీ చలికాలం వచ్చేసరికి వెచ్చదనాన్ని ఇవ్వడానికి మీ ఉన్ని దుస్తులు సిద్ధంగా (భద్రంగా) ఉంటాయి. ✧